
నమస్తే తెలంగాణ
# ఖమ్మం
I | ఖమ్మం, బుధవారం 1 మే 2024 | KHAMMAM




ఉమ్మడి జిల్లా నాయకులతో సమీక్షిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



# బీఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు

## ముఖ్య నాయకులతో అధినేత కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో అధినేత కేసీఆర్ అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను గెలిచి తీరాలన్నారు. మంగళవారం కొత్తగూడెం రోడ్ షో అనంతరం ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నాయకులతో ఇల్లెందు అతిథి గృహంలో సమావేశమయ్యారు. ''మనకుసానుకూల వాతావరణం ఉంది. కాంగ్రెస్‌ను, బీజేపీని ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఇక్కడి రెండు ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలి'' అని అన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, నాయకుడు దిండిగల రాజేందర్ పాల్గొన్నారు.

# ఖమ్మం@92.24

- ఈ ఏడాది పెరిగిన ఉత్తీర్ణత శాతం
- 21వ స్థానంలో జిల్లా
- 294 మందికి టెన్ జీపీఏ

**గత సంవత్సరాల ఫలితాలను పరిశీలిస్తే..**

| సంవత్సరం | శాతం | స్థానం |
|---|---|---|
| 2022 | 90.78 | 22వ స్థానం |
| 2023 | 88.72 | 18వ స్థానం |
| 2024 | 92.24 | 21వ స్థానం |

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 : పది ఫలితాల్లో ఖమ్మం జిల్లా ఉత్తీర్ణత శాతం మెరుగుపడింది. గత సంవత్సరంతో పోలిస్తే నాలుగుశాతం పెరిగింది. పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 16,541 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో బాలురు 8,521మంది, బాలికలు 8,020 మంది పరీక్షలు రాశారు. వీరిలో బాలురు 7,714 మంది ఉత్తీర్ణులై 90.53 శాతం నమోదు చేశారు. బాలికలు 7,544 మంది ఉత్తీర్ణులై 94.06శాతం నమోదు చేశారు. మొత్తం 15,258 మంది ఉత్తీర్ణులై 92.24 శాతాన్ని నమోదు చేశారు. రాష్ట్ర సగటు 91.31 ఉత్తీర్ణతతో పోలిస్తే జిల్లా ఉత్తీర్ణత ఒక శాతం అధికంగా ఉంది. జిల్లా ఉత్తీర్ణత స్థానంలో 21వ స్థానంలో నిలిచింది. గ్రేడ్–ఏ1 పది పాయింట్లు, ఏ2 తొమ్మిది పాయింట్లు, బీ–1 ఎనిమిది పాయింట్లు, బీ–2 ఏడు పాయింట్లు, సీ–1 ఆరు పాయింట్లు, సీ–2 ఐదు పాయింట్లు, డీకి నాలుగు పాయింట్లుగా విద్యాశాఖాధికారులు విభజించారు. ఇప్పటివరకు ఏ ఫలితాల్లోనైనా ప్రతి సంవత్సరం బాలికలే పై చేయి సాధిస్తూ వచ్చారు.

**ఫలించిన వ్యూహం..**

జిల్లా విద్యాశాఖ పరిస్థితిని మెరుగుపరిచేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, కలెక్టర్ వీపీ గౌతమ్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ అభివృద్ధికి కృషిచేశారు. అవకాశం ఉన్న అంశాలను సద్వినియోగపర్చుకుంటూ విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషించారు. ప్రైవేటు పాఠశాలలు ఎప్పటిలాగానే పదికిపదికి గ్రేడింగ్ పాయింట్లు సాధించి తమ హవాను మరోసారి కొనసాగించాయి.

**సైన్స్‌లోనే ఫెయిల్..**

విద్యార్థులు ఫెయిలైన వారిలో అత్యధిక మంది సైన్స్ సబ్జెక్ట్‌లోనే ఉన్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఒక్క సబ్జెక్ట్ ఫెయిలైన వారిలో సైన్స్ విద్యార్థులే ఎక్కువ. అత్యధికంగా హిందీలో ఎక్కువ ఉత్తీర్ణత సాధించగా, తెలుగులో 535 మంది, ఇంగ్లిష్‌లో 267 మంది, గణితంలో 240 మంది, సోషల్‌లో 90 మంది ఫెయిలయ్యారు.

**జిల్లాలో 294 మందికి టెన్ జీపీఏ...**

జిల్లాలో 294 మందికి టెన్ జీపీఏ సాధించారు. బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో ఆరుగురు, మోడల్ స్కూల్స్‌లో ఒకరికి, ప్రైవేట్ స్కూల్స్‌లో 278 మందికి రెసిడెన్సియల్ పాఠశాలల్లో ముగ్గురికి, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఇద్దరికి టెన్ జీపీఏతో రాణించారు. అత్యుత్తమంగా ట్రైబల్ వేల్ఫేర్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 98శాతంకిపైగా ఉత్తీర్ణత సాధించారు.

# మీలో ఒకడిని.. నన్ను ఆశీర్వదించండి

**– బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు**



ఆటో నడుపుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఆటోవాలాగా మారారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉదయం ఖమ్మం పాత బస్టాండుకు పోయి ప్రయాణికులు, ఆటోవాలాలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పిలిస్తే పలుకుతా.. మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఆదుకుంటాను.. మీ వాడిని మీలో ఒకడిని... నన్ను ఆశీర్వదించండంటూ నామా వారితో మమేకమయ్యారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న రోజువారీ కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. స్వయంగా ఆటో నడిపి వారితో ఏకమయ్యారు. ఆటోడ్రైవర్లు నామాను ఆత్మీయంగా పలకరించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డేరంగుల బ్రహ్మం, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, మోరంపూడి ప్రసాద్, నామా రామారావు, నామా భవ్యతేజ, సాయిరాం, నల్లమోతు కోటేశ్వరరావు, ఆటోడ్రైవర్ల యూనియన్ నాయకులు సందీప్, సుబ్బారావు, వెంకటేష్, పుల్లారావు, పాటు తాళ్లూరి హరీష్, చీకటి రాంబాబు, సరిపూడి గోపీ సందేశ్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# ఎన్నికల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 30 : ఎన్నికల శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకొని, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలల్లో పీవో, ఏపీవో, ఓపీవోలకు విధుల పై చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవో, ఏపీవో, ఓపివోలు ఒక టీమ్‌ల పూర్తి అవగాహనతో పనిచేయాలన్నారు. పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఎన్నికల అధికారులు, బ్యాలెట్ యూనిట్, ఏజెంట్‌ల సీటింగ్ నమూనా మేరకు చేపట్టాలన్నారు. పోలింగ్ యంత్రాల సమస్యలు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ సందర్భంలో సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ అధికారులు–1, 2, 3లు ఎన్నికల సందర్భంలో ఏ ఏ విధులు నిర్వర్తించాలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలన్నారు. మాక్‌పోల్ పూర్తయ్యాక తప్పనిసరిగా క్లియర్ చేయాలన్నారు. బూత్ ఆక్రమణ, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, క్యూ నిర్వహణ ఎలా చేయాలి, ఓటర్ల గుర్తింపు ఏ విధంగా చేపట్టాలి, ఓటింగ్ తర్వాత క్లోజ్ బటన్, ఓటింగ్ యంత్రాల సీలింగ్, ఎన్నికల పత్రాల సీలింగ్, చట్టబద్ధమైన ఫారాలు పూరింపులపై అవగాహన కల్గివుండాలని వారు అన్నారు. ఎన్నికల సంఘంచే జారీచేసిన పీవో హ్యాండ్‌బుక్, పూర్తిగా చదివి, ఏ సమయంలో ఏం చేయాలి తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా పవర్ పాయిట్ ప్రజంటేషన్ ద్వారా పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. ఓటింగ్ యంత్రాలపై హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. వారికి కేటాయించిన పోలింగ్‌కేంద్రాల్లో తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఇతర నియోజకవర్గాల్లో ఓటుహక్కు ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు ఎల్. రాజేందర్, మధు, మాస్టర్ ట్రెయినర్లు శ్రీరామ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శిక్షణ నోడల్ అధికారి అలీం, అధికారులు పాల్గొన్నారు.











